International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.5, Issue-7, July, 2018
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# గురజాడ "కన్యక" - నేటి యువతకు స్ఫూర్తి

డా॥ సి.హెచ్.ఎమ్.ఎస్.కుమారి
తెలుగు అధ్యాపకురాలు
మిసెస్.ఏ.వి.ఎన్.కళాశాల
విశాఖపట్నం
chmskumari@gmail.com

"బ్రతికి చచ్చియు ప్రజలకెవ్వడు
ప్రీతి ( గూర్చునో వాడే ధన్యుడు"

ఆధునిక శబ్దానికి నూతనమైంది, ఇటీవల కాలంలో పుట్టిందని అర్థం. క్రీ॥శ॥ 1875కు పూర్వమున్న సాహిత్యాన్ని ప్రాచీనమని, తదనంతర సాహిత్యాన్ని ఆధునికమని వ్యవహరిస్తున్నాం. ఆధునికమన్నది కాలానికి, సాహిత్యస్వభావానికి రెండింటికీ చెందింది. ఇంగ్లీషు వారు మనదేశాన్ని పాలించిన ఫలితంగా విప్లవాత్మక మార్పులు రావడంవల్ల తెలుగు సాహిత్యంలో ఆధునికత కన్పిస్తుంది. వాడుక భాషగా తెలుగు వికసించటానికి వెలుగుబాటవేసిన మహాకవి గురజాడ అప్పారావుగారు. సంఘ సంస్కరణకు దారిచూపే రచనలు చేసిన ధీశాలి. "ముత్యాలసరం" అన్న ఛందస్సును స్వయంగా కూర్చుకొని అనేక గేయాలను రాశారు". "ముత్యాలసరాలు" సంపుటిలోనిదీ "కన్యక". సగటు పాఠకుడు నిఘంటువుల సహాయం లేకుండా చదువుకొని ఆనందించే సరళరీతిలో ఉంటుందిది. ఆధునిక భావాలతో వ్యవహారభాషలో కొత్త పద్ధతిలో రచనలు చేసిన గురజాడ నవయుగవైతాళికుడుగా ప్రసిద్ధిపొందారు. కన్యక ఒక చరిత్రాంశం, విషాదాంత కావ్యఖండిక చారిత్రక గాథలోని దుండగుడైన రాజు రాజరాజ విష్ణువర్థనుడు. ఇతని రాజధాని రాజమహేంద్రవరం. వేంగిరాజ్యపాలకుడుగా అతని అధికార పరిధిలోని పెనుగొండలో కుసుమశ్రేష్ఠి పుత్రిక "వాసవికన్య" పెళ్ళి వయసు వచ్చిన అందగత్తె, ఒకనాడు ఆమె తనచెలికత్తెలతో దుర్గాదేవి పూజకై ఆలయానికి బయలుదేరుతుంది. అప్పుడు అటుగా వచ్చిన పట్నమేలే రాజు ఆమెను చూచి మోహించి బలాత్కారంగా ఆమెను పొందడానికి ప్రయత్నిస్తాడు.

" పట్టవలెరా దీని బలిమిని
కొట్టవలెరా మరుని రాజ్యం
కట్టవలెరా గండపెండెం
రసిక మండలిలో"

అనుకుంటాడు. నాటి సమాజంలో స్త్రీకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేవు. పురుషునితో సమాన స్థాయికి ఆమె ఎదగలేదు. కులనియమం వివరించి చెప్పారు కులపెద్దలు. అగ్నిసాక్షిగా పెళ్ళి చేసుకోవడం మంచిదన్నాడు కన్యక తండ్రి. అందుకు రాజు కోపగించాడు. అడ్డు హద్దులు లేని రాజరికం - కులధర్మాలకు స్త్రీల మానాభిమానాలను మంటగలిపే విధంగా పరిణమించిందని చెప్పడానికేగాక "రసికత" పేర రాజరిక వ్యవస్థలో జరుగుతున్న దౌర్జన్యాన్ని నిరసించడానికి కూడా గురజాడ తానీకావ్యాన్ని రాసినట్టు తెలుస్తుంది. నగరి నిండుగా వున్న సుందరులు చాలక, బహుభార్యత్వం తృప్తినివ్వక, దేవాలయానికి చెలికత్తెలతో సహా నడివీధిని నడుస్తున్న కన్యను పట్టపగలు చుట్టివేసిన పట్టపురాజుకు పశువుకీ తేడా కనపబడదు. అదే ఈ పద్యంలో -

"నాల నడుమును నట్టివీధిని
దుష్టమంత్రులు తాను పెండెం
గట్టి కన్నెను చుట్టి నరపతి

పట్టనుంకించెన్"
పట్టపగలే నట్టివీధిని
పట్టబోరే జారచోరులు
పట్టదలచితి వింక నీవాక
పట్టమేలే రాజువట!

పరస్త్రీల మానాభిమానాలు దోచే రాజులు జారచోరులుకంటే నికృష్టులని కన్యక చేత రాజును నిందింపజేసిన కవి, జమిందారీయుగపు అవలక్షణాలన్నింటినీ, మరియు పురుషాధిక్యం, స్త్రీదాస్యం, ఖిన్నత, "రాసిక్యం" వీటిన్నింటినీ ఖండింపచేశాడు. నాటి రాజులను గూర్చి రాస్తూ, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు "వెనుకటి కాలం అలాంటిది కాదు, ఒక జమిందారుడున్నాడంటే వాడి గ్రామాల్లో వుండే స్త్రీలందరునూ, అవసరమైతే భార్యత్వానికి అంగీకరించవలసిందే, రాజులు, రాజపురుషులు పూర్వం బకాసురుడిలాగా నిన్నమొన్నటిదాకా సంసార స్త్రీలను బాధించడం వుండేది" అన్నారు. రాజు దౌర్జన్యానికి పర్యావసానం - కన్యక సజీవదహనం. ఇది పైశాచిక కామంవల్ల జరిగింది. నాటకీయంగా నడిపిన ఈ కవితాగాథను గురజాడ సమాజంలో స్త్రీకి జరుగుతున్న దురన్యాయాన్ని చూపడానికి రాసిందే. ఇప్పటికీ అత్తవారిళ్ళల్లో కోడళ్ళ సజీవ దహనాలు జరుగుతున్నాయి, స్త్రీల మానభంగాలు మామూలు విషయాలు అయిపోయాయి. అప్పటికీ ఇప్పటికీ స్త్రీల పరిస్థితుల్లో గర్వించదగ్గ మార్పులేదు. స్త్రీల దుస్థితి తొలగిపోతుందన్న ఆశాభావం గురజాడకుంది. ఒంగోలు మునిసుబ్రహ్మణ్యానికి 1909 మే నెల 1వతేదీన రాసిన ఉత్తరంలో "ఆధునిక మహిళలు మానవచరిత్రను తిరగరాస్తా"రన్న తన నమ్మకాన్ని వ్యక్తంచేశారు. రాజు అధికార గర్వంతో ఆమెను బలాత్కారంగా పొందాలనుకుంటాడు అందుకే ఆ మదోన్మత్తరాజు నోటివెంట-

"డేగ, పిట్టనుపట్టి విడుచున?
కన్నె, యింటికి మరలి నడుచున?"

అనిపిస్తాడు కవి. ఈ మాటల్లో రాజరిక అహంకారపు నీచత్వాన్ని వెల్లడించాడు. అదీగాక కన్యక తండ్రితో -

"రాజు తలచిందేను ధర్మం
రాజు చెప్పిందెల్ల శాస్త్రం
రాజులకు పేరైన పద్ధతి
కాద, గాంధర్వం ?" అంటాడు.

ఇది రాజుయొక్క రాజరిక అహంభావానికి పరాకాష్ఠ. రాజుకు ఎదురు చెప్పలేని నిస్సహాయస్థితిలో వుంది వైశ్యసంఘం. రాజు బారినుండి తనవారెవరూ రక్షించలేని గ్రహించి మోక్షం కోరుతూ ఆత్మాహుతికి నిర్ణయించుకున్నదై రాజు దౌర్జన్యానికి గుణపాఠం చెప్పడానికి సిద్ధపడింది కన్యక. ఆ అగ్నిగుండం చుట్టూ నిర్వీర్యులై నిలిచి చూస్తున్న జనులతో ఇట్లా అంటుంది- "విద్య, వీరత్వం లేని జాతి అందరకూ లోకువ" అని కన్యక హెచ్చరించింది.

"విద్యనేర్చినవాడు విప్రుడు
వీర్యముండినవాడు క్షత్రియు
డన్న పెద్దల ధర్మ పద్ధతి
మరచి, పదవులకై
"ఆశ చేయక, కాసువీసం
కలిగివుంటే చాలుననుకొని
వీర్యమెరుగక, విద్యనేర్చక
బుద్ధిమాలినచో
కలుగవా యిక్కట్లు ?"

అని కన్యక సూటి ప్రశ్న. బుద్ధిబలము, బాహుబలము పెంచుకోండని కన్యక ప్రబోధం.పట్నమేలే రాజు దౌర్జన్యానికి తలవొగ్గిన ఆ పెద్దల్ని "పరువు నిలపను పౌరుషము మీకేల కలుగదకో? అని ప్రశ్నిస్తుంది. మేల్కొని బుద్ధిబలమును, బాహుబలమును పెంచుకోమని, నిరంకుశుల ప్రతిఘటనకు పూనుకొమ్మని హెచ్చరిస్తుంది.

"పట్నమేలే రాజు అయితే
రాజు నేలే దైవముండడొ ?
పరువు నిలపను పౌరుషము మీ
కేల కలుగదొకో ?

అంటూ పౌరుల్లో పౌరుషాగ్నిని రగుల్కొల్పే సన్నివేశంలో రేఖామాత్రంగా తిరుగుబాటుతత్వాన్ని ప్రబోధించాడు గురజాడ. కన్యక మంటల్లో దూకుతూ ఇలా అన్నట్లు -

"పట్నమేలే రాజువైతే
పట్టుము నన్నిపుడు"

కవి చెప్పడంలో రాజరికపు వ్యర్థత్వం ఈ గేయపు సందేశమని అదే ఈ కథకు లక్ష్యమని తెలుస్తుంది. అదే చివరి మాటల్లోనూ చెప్తాడు కవి-

"పట్టమేలే రాజు పోయెను
మట్టి కలిసెను కోటపేటలు
పదం పద్యం పట్టి నిలిచెను
కీర్తు లపకీర్తుల్"

అని ఈ గేయాన్ని నవ్యరీతిలో ముగించాడు గురజాడ కన్యకలో గురజాడ మానవతావాద విలువల్లో ఒక్కటైన నీతికి పట్టంగట్టారు. నీతివంతమైన ప్రవర్తన ఒక్కటే మనిషిని ఉన్నతుడిగా, ఆదర్శప్రాయుడిగా చేయగలదు. సాంఘికంగా, ఆర్థికంగా ఉన్నతస్థానాన్ని పొందిన, రాజులో నీతి లోపించింది కాబట్టే పతనమయ్యాడు. కన్యక నైతికంగా అత్యున్నత స్థాయిని అందుకోగలిగిన విజ్ఞురాలు కాబట్టే పురుషాధిక్య సమాజంలో ఉంటూ కూడా ఒక సామాన్య వర్తకుని కూతురైన ఆదర్శప్రాయురాలు కాగలిగింది.

పరస్త్రీ వ్యామోహంతో ప్రవర్తించేవాడు పతనం కాక తప్పదని, స్త్రీలను గౌరవించాలని, వారి అభిప్రాయాలకు విలువనివ్వాలని ఈ ఖండిక తెలియచేస్తుంది. కన్యక ద్వారా గురజాడ చేసిన ప్రబోధం వైశ్యజాతికే కాదు యావజ్జాతికీ వర్తించేటటువంటిది. పారతంత్ర్యంలో కుములుతున్న జాతిని మేల్కొల్పడం ఆయన ఆశయం. స్వాభిమానులై, స్వాతంత్ర్యాన్ని సాధించుకోమని, వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోమని ఆయన ప్రబోధం. ధనాఢ్యులైన రాజులు సామాజికంగా జరుపుతున్న దాష్టీకాన్ని తృణీకరిస్తూ, రాజరికవ్యవస్థలో జీవించిన గురజాడ ఆ వ్యవస్థనే సవాలుచేసిన ఈ కథను గ్రహించడం విశేషం. ఈ విధంగా ఆధునికభావవ్యాప్తికీ, సామాజిక స్పృహకీ అంకితమై కవిత్వం రాసిన ఆధునిక కవి, ప్రజాకవి గురజాడ. కనుకనే -

"అడుగుజాడ గురజాడది
అది భావికి బాట" అంటారు శ్రీశ్రీ.

**<u>ఆధార గ్రంథాలు</u>**

1) ముత్యాల సరాలు (కవితాసంపుటి) - గురజాడ అప్పారావు
2) ఆధునికాంధ్ర కవితా సమీక్ష - ఆచార్య కె.వి.ఆర్. నరసింహం
3) మహోదయం - కె.వి.రమణారెడ్డి (జాతీయ పునరుజ్జీవనంలో గురజాడ స్థానం)
4) ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు - ఆచార్య సి.నా.రె.